క్లుప్తంగా

మునేటికి వరద నీరు



వత్సవాయి : నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మునేటికి వరదనీరు చేరుతోంది. మునేటికి ఎగువ ప్రాంతాలైన తెలంగాణలోని వరంగల్, ఖమ్మం జిల్లాల్లో కూడా భారీ వర్షాలు కురుస్తుండటంతో వరదనీరు భారీగా చేరుతోంది. ఆదివారం నాటికి పోలంపల్లి ఆనకట్ట వద్దకు 2317వేల క్యూసెక్కుల వరదనీరు వస్తున్నట్లు ఇరిగేషన్ జేఈ ఆర్.నరసింహారావు తెలిపారు. నీటి ఉధృతిని దృష్టిలో ఉంచుకుని లింగాల వద్ద మునేటిపై ఉన్న కాజ్‌వేకు ఇరుపక్కలా రెవెన్యూ, పోలీస్ అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు. వరద తీవ్రత ఎక్కువగా ఉంటే కాజ్‌వేపై రాకపోకలను నిలిపివేయనున్నట్లు అధికారులకు వివరించారు.

ముత్యాలమ్మకు బోనాలు సమర్పణ



వెల్లంకి(వీరులపాడు): మండలంలోని వెల్లంకిలో వేంచేసియున్న ముత్యాలమ్మ అమ్మవారికి ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారికి మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జోరువానను సైతం లెక్కచేయకుండా అమ్మవారికి గ్రామస్తులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి బోనాలు సమర్పించారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఆషాడమాసంలో ముత్యాలమ్మ అమ్మవారికి బోనాలు సమర్పిస్తే వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండుతాయని గ్రామస్తులు చెబుతున్నారు.

శాకంబరిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

కంచికచర్ల : ఆషాఢ పౌర్ణమి సందర్భంగా మండలంలోని గొట్టుముక్కల అంకమ్మతల్లి ఆదివారం శాకంబరదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు సమర్పించిన కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అలయ ప్రాంగణాన్ని కూరగాయలు, ఆకుకూరలతో అందంగా తీర్చిదిద్దారు. గ్రామస్తులు తెల్లవారుజామునుంచే ఆలయానికి తరలిరావడంతో భక్తులతో ఆలయం కిటకిటలాడింది. పరిటాలలోని అమ్మవారిని కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అదేవిధంగా గురుపౌర్ణమి సందర్భంగా షిర్డి సాయిబాబా ఆలయంలో స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నీరాజన మంత్రపుష్పములు, అష్టోత్తర పూజలు మహన్యాసపూర్వక అభిషేకాలు నిర్వహించారు.



గొట్టుముక్కల శాకంబరిదేవిగా దర్శనమిస్తున్న అంకమ్మతల్లి



పరిటాలలో అమ్మవారికి కూరగాయలతో అలంకారం



శాకంబరీ అలంకారంలో ఈశ్వరీ అమ్మవారు



పెనుగంచిప్రోలులో శాకంబరీ అలంకరణలో అమ్మవార్లు



జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, ఈశ్వరీదేవి అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని కూరగాయలతో శాకంబరీదేవిగా ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకుడు సోమోజు సాయిరాం ఆచార్యులు ఆధ్వర్యంలో మహిళలు కుంకుమార్చనలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మండలంలోని గురుధాం ఆశ్రమంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

సాయినాథుడికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భకులు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సౌమ్య, భక్తులు



పేట ఆనందసాయి ఆలయంలో ప్రత్యేకాలంకరణలో స్వామివారు

నందిగామటౌన్: పట్టణంలో గురు పౌర్ణమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంతో పాటు మండలంలోని సాయిబాబా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని సద్గురు సాయినాథుని ఆలయాన్ని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ సాయినాథుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులతో జీవనం సాగించాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా పాత బస్టాండ్ సమీపంలోని మహిమసాయి ఆలయం, రామలింగేశ్వర నగర్‌లోని షిర్డీ సాయి బాబా, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయాల్లోనూ గురుపౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

చందర్లపాడులో..

గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న సాయిమందిరాల్లో సాయినాధునికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని చింతలపాడులో నూకేశ్వరీ అమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ పబ్బతి ప్రసాద్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారిని ఆలయ అర్చకులు శాకంబరీదేవిగా అలంకరించి విశేషపూజలు, అభిషేకాలు చేశారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామస్తులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

పెనుగంచిప్రోలు: గురుపౌర్ణమి వేడుకలను పెనుగంచిప్రోలు మండలంలో ఆదివారం మండలంలో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక కాజ్‌వే వద్ద , చెరువు కట్ట వద్ద వేంచేసి ఉన్న శ్రీషిర్డీ సాయిబాబా ఆలయాల్లో స్వామి వారికి పంచామృతాలు, పవిత్ర జలాలు, అన్నాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కొణకంచిలోని సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయాల్లో గురుపౌర్ణమి పూజలు

జగ్గయ్యపేట అర్బన్: గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం జగ్గయ్యపేట పట్టణంలోని పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. స్థానిక ఆనందసాయి ఆలయంలో బాబా విగ్రహాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. సాయిబాబాను సందర్శించిన భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

భక్తులకు అనుగ్రహభాషణం..

అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని మేల్కొపే వ్యక్తే గురువు అని తాత్వాకులు చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రి అన్నారు. ఆయన నివాసంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. భక్తుల నుద్దేశించి ఆయన అనుగ్రహభాషణం చేశారు.

ఉప్పలమ్మకు ఉదయభాను ప్రత్యేక పూజలు



ఉప్పలమ్మ తల్లికి పూజలు చేస్తున్న సామినేని ఉదయబాను, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని శాంతినగర్‌లో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు శేషం ప్రసాద్ తోటలో ఉప్పలమ్మ తల్లి కొలువు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ శేషం సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే తాతయ్య జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే తాతయ్య బర్త్‌డే కేక్‌ను కట్ చేస్తున్న, శ్రీరాం సిద్ధూ, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: ఎమెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) జన్మదినాన్ని టీడీపీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంవద్ద పేదలకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే తాతయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కేక్‌ను టీడీపీ యువనాయకుడు శ్రీరాం సిద్ధూ, పార్టీ నాయకులు కట్‌చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, మాజీ వైస్ చైర్మన్ నూకల కుమార్‌రాజా, పట్టణ అధ్యక్షుడు మేకా వెంకటేశ్వర్లు, 22వ వార్డు కౌన్సిలర్ గొట్టె నాగరాజు, నీలం శివ, కావేటి కోటేశ్వరరావు, ఎం.అచ్చయ్య, గుగ్గిళ్ల శివ, జి.శ్రీను, యు.గోపి పాల్గొన్నారు.

నేడు 'కాసం' ఫ్యాషన్స్ షోరూం ప్రారంభం

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపో పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన 'కాసం ఫ్యాషన్స్' షాపింగ్ మాల్‌ను సోమవారం ఉదయం 11గంటలకు ప్రారంభించనున్నట్లు ఆసంస్థ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ షోరూం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర హాజరవుతారన్నారు. కాసం ఫ్యాషన్స్ షోరూంను సినీ హీరోయిన్ నభానటేష్ ప్రారంభిస్తారని, అందరూ హాజరుకావాలని ఆ సంస్థ ప్రతినిధులు కోరారు.

సంగీతసాహిత్యాలు భగవదత్తమైనవి

విజయవాడ కల్చరల్: సంగీత సాహిత్యాలు భగవదత్తమైన వరాలని ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరక్టర్ కేవీఎస్ చక్రధర్ అన్నారు. శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో ఆదివారం శివరామకృష్ణ క్షేత్రంలో యువ స్వరలయ సౌరభం సంస్థ నిర్వహించిన సంగీత పోటీ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. చక్రధర్ మాట్లాడుతూ బాల బాలికల్లో ప్రతిభ అంతర్లీనంగా ఉంటుందని తల్లిదండ్రులు, గురువులు ముందుగా గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు.

సీనియర్ మెకానిక్‌లకు సన్మానం



సీనియర్ మెకానిక్‌లను సన్మానిస్తున్న టూవీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక షేక్ షబ్బీర్ మెకానిక్ షాపులో జగ్గయ్యపేట టూవీలర్స్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెకానిక్‌లంతా కలసి తమ గురువులైన సీనియర్ మెకానిక్‌లు కె.చంద్రశేఖర్, జి.దుర్గాబాబు, జి.చిన్నబాబు, బందరు శ్రీను, షేక్ సైదా, ఎండీ.ఖలీల్, జి.రవి, పూర్ణ, షేక్ మీరాలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంఘ అధ్యక్షుడు గొల్లపూడి ముక్తేశ్వరరావు మాట్లాడుతూ గురుపౌర్ణమి సందర్భంగా ప్రతిఒక్కరూ వారి ఉన్నతికి దోహదపడిన గురువులను సత్కరించుకోవడం చక్కటి సంప్రదాయమని పేర్కొన్నారు. నవ్యాంధ్ర టూవీలర్స్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘ జిల్లా ముఖ్య సలహాదారుడు, జగ్గయ్యపేట సంఘ గౌరవాధ్యక్షుడు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ అసోసియేషన్ తరఫున టూవీలర్ వాహనాల మెకానిక్‌లకు శిక్షణ ఇస్తామని తెలిపారు. సంఘ సభ్యుల సంక్షేమం కోసం పనిచేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పి.మౌలాలి, షేక్ షబ్బీర్, జలీల్, రమణ, ముత్యం, మెకానిక్‌లు పాల్గొన్నారు.

కుండపోతగా వర్షం

డివిజన్‌లో 83.8 మి.మీ వర్షపాతం

కంచికచర్ల : నందిగామ డివిజన్‌లో వర్షం కుండపోతగా కురుస్తోంది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా చోట్ల వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కంచికచర్ల నుంచి చెవిటికల్లు వెళ్లే రోడ్డుపై లక్ష్మయ్య వాగు పొంగిపొర్లుతుండటంతో ఈ మార్గంలో రవాణా స్తంభించింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలబడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. డివిజన్ పరిధిలోని చెరువులన్నీ నిండుకుండలా ఉన్నాయి. నందిగామ డివిజన్‌లో ఆదివారం ఉదయానికి 83.8మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కంచికచర్లలో 9.2మి.మీ, నందిగామలో 10.0, చందర్లపాడులో 8.6, వీరులపాడులో 11.8, జగ్గయ్యపేటలో 12.4, పెనుగంచిప్రోలులో 19.2, వత్సవాయిలో 12.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని అధికారులు తెలిపారు. కుండపోతగా కురుస్తున్న వర్షానికి సాగుచేసిన పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.